RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

భారీ క్రేన్ కూలీ ముగ్గురు కార్మికులు మృతి సిమెంట్ బ్రిక్స్ తయారీ పరిశ్రమలో ఘటన 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 98 | ఏప్రిల్ 28 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 98 | April 28 Tuesay 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


# మహిళలు పిల్లల రక్షణకు అత్యంత ప్రాధాన్యత

## 'స్పందన' బృందాలను ప్రారంభించి మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ**
అభివృద్ధి చెందిన దేశాలు మరియు నగరాల్లో మహిళలు, చిన్నారుల రక్షణకే ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని, ఎక్కడైతే వారికి భద్రత ఉంటుందో అక్కడే ప్రగతి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్పందన' బృందాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేస్తోందని, గతంలో షీ టీమ్స్ వంటి కార్యక్రమాలు ఉంటే, ఇప్పుడు బాధిత మహిళలకు తక్షణమే మానసిక భద్రత, భరోసా కల్పించేందుకు ఈ స్పందన టీమ్స్ పనిచేస్తాయని వెల్లడించారు. మహిళలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ప్రభుత్వం తమ పక్కన నిలబడుతుందనే విశ్వాసాన్ని కల్పించడమే తమ లక్ష్యమని, సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే అసలు నేరమే జరగకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత అందరిపైన ఉందని ఆయన గుర్తుచేశారు.
చారిత్రక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ, అమెరికా వంటి దేశాల్లోనే మహిళలకు ఓటు హక్కు రావడానికి దశాబ్దాలు పట్టిందని, కానీ భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే నెహ్రూ మహిళలకు సమాన హక్కులు కల్పించారని సీఎం అన్నారు. దేశానికి మహిళా ప్రధానిని, లోక్‌సభ స్పీకర్‌ను, గవర్నర్లను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం 2013లోనే కాంగ్రెస్

➤ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన



### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, ప్రజా సమస్యలపై ఇక నుంచి బీఆర్ఎస్ ఉధృతంగా పోరాడుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ధాన్యం కొనుగోళ్లు అత్యంత అధ్వాన్నంగా సాగుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. ఎటువంటి

➤ మిగతా 2వ పేజిలో..

## ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్ 2



# రెండోవిడత ప్రచారానికి తెర

## సీఎం ప్రమాణా స్వీకారానికి వస్తా : ప్రధాని



**కలకత్తా జనసంఘర్షణ**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగింపు దశకు చేరుకుంది. ఏప్రిల్ 29న రాష్ట్రంలో రెండో విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, సోమవారం సాయంత్రంతో బహిరంగ ప్రచారానికి తెరపడింది. ఈ సందర్భంగా బారక్‌పుర్‌లో నిర్వహించిన తన చివరి ఎన్నికల ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని భాజపా విజయంపై ధీమా వ్యక్తం చేశారు. బెంగాల్‌లో ఈసారి ఖచ్చితంగా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని, మే 4న వెలువడే ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విజయ విందులు, మిఠాయిల పంపిణీ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తాను ప్రస్తుతానికి ప్రచారం ముగించి వెళున్నప్పటికీ, త్వరలోనే రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరబోయే భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు మళ్లీ బెంగాల్ గడ్డపై అడుగుపెడతానని మోదీ ప్రకటించారు. ర్యాలీకి తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ.. తాను హెలిప్యాడ్ నుంచి వస్తున్నప్పుడు సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి తనకు ఘనస్వాగతం పలకడం చూసి ముగ్ధుడనయ్యానని చెప్పారు. ఇంతటి అపారమైన ప్రజాదరణను, ఆశీస్సులను తాను ఊహించలేదని సంతోషం వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించిన

➤ మిగతా 2వ పేజిలో..

# బంగారం మరింత పైకి



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగి సరికొత్త గరిష్ఠాలను తాకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న ఆర్థిక పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో పసిడి ధరలు నిలకడలేకుండా పైపైకి కదులుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు గణనీయమైన

➤ మిగతా 2వ పేజిలో..

# ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపులు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి (శంషాబాద్ ఎయిర్‌పోర్టు) సోమవారం బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం సృష్టించింది. విమానాశ్రయ

➤ మిగతా 2వ పేజిలో..

# రాజ్యసభ ఎంపీల విలీనానికి గ్రీన్ సిగ్నల్

## రాజ్యసభలో అనూహ్య రాజకీయ పరిణామాలు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
రాజ్యసభలో అనూహ్య రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు భారతీయ జనతా పార్టీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిర్ణయంతో ఎగువ సభలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఆప్ నుంచి ఫిరాయించిన రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్, విక్రమ్‌జీత్ సాహ్నే, రాజేందర్ గుప్తాలను ఇకపై బీజేపీ సభ్యులుగానే పరిగణించాలని ఛైర్మన్ స్పష్టం చేశారు. తామంతా బీజేపీలో చేరుతున్నామని, తమను ఆ పార్టీ ఎంపీలుగానే గుర్తించాలని కోరుతూ ఈ ఏడుగురు సభ్యులు సమర్పించిన వినతి పత్రానికి తాజాగా అధికారిక ఆమోదం లభించింది. దీంతో రాజ్యసభలో బీజేపీ బలం 106 నుంచి 113కి పెరగగా, ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యుల సంఖ్య 10 నుంచి కేవలం మూడుకు పడిపోయింది. ఈ విలీన ప్రక్రియపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది.

➤ మిగతా 2వ పేజిలో..

# మహిళలు పిల్లల రక్షణకు అత్యంత ప్రాధాన్యత

**మొదటిపేజీ తరువాయి..** బిల్లును ఆమోదించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకంలోనూ మహిళలకు అగ్రస్థానం ఇస్తోందని, ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతోనే ఇస్తున్నామని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా గత 28 నెలల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని పకడ్బందీగా అమలు చేయడం వల్ల ఆడబిడ్డలకు సుమారు 10 వేల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు 60 వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు అందించామని, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, యూనిఫాంలు కుట్టే బాధ్యత, పెట్రోల్ బంకుల నిర్వహణతో పాటు సోలార్ ప్లాంట్ల బాధ్యతను కూడా మహిళా సంఘాలకే అప్పగించామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలంటే మహిళా భద్రత అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో డ్రగ్స్, గంజాయి మహమ్మారిపై ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పంజాబ్ వంటి రాష్ట్రాలు డ్రగ్స్ వల్ల ఎలా నిర్వీర్యమయ్యాయో గుర్తు చేస్తూ, తెలంగాణలో మత్తు పదార్థాల విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారే మహిళలు, చిన్నారులపై అకృత్యాలకు పాల్పడుతున్నారని, అందుకే 'ఈగల్ ఫోర్స్' ద్వారా నేరగాళ్లను కఠినంగా వేటాడుతున్నామని స్పష్టం చేశారు. డ్రగ్స్ కేసుల్లో ఎవరూ ఉన్నా, వారు సెలబ్రిటీలైనా, ప్రజాప్రతినిధులైనా, ఎంతటి ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులైనా సరే విడిచిపెట్టే ప్రసక్తే లేదని, ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధులను అరెస్టు చేశామని గుర్తుచేశారు. పాఠశాలల్లో చేరే సమయంలోనే డ్రగ్స్ తీసుకోమని సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చే విధానాన్ని తీసుకురావాలని సూచించారు. సమాజంలో భయం, బాధ్యత లేనప్పుడు విచ్చలవిడితనం పెరుగుతుందని, అరాచక శక్తుల పట్ల ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన తేల్చి చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని మహిళల రక్షణకు పర్యాయపదంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన

**మొదటిపేజీ తరువాయి..** ఆంక్షలు లేకుండా మక్కలు, జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రైతుబంధు వంటి పథకాలతో ఐక్యరాజ్యసమితి ప్రశంసలు పొందిన తెలంగాణలో, నేడు రైతులు ఇబ్బందులు పడటం దురదృష్టకరమని, ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేసినట్లు కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేశామన్నారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందని, తాము ఉండి ఉంటే ఆయనతో క్షమాపణలు చెప్పించేవారమని పేర్కొన్నారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ ఉద్దేశపూర్వకంగా అడ్డుపడుతోందని విమర్శిస్తూ, దానికి మద్దతుగా మరో తీర్మానం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై కూడా చర్చించామని, ఇతర రాష్ట్రాల్లో లక్షలాది ఓట్ల తొలగింపు అంశాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని కేసీఆర్ దిశానిర్దేశం చేశారని తెలిపారు. జూబ్లీహిల్స్ వంటి చోట్ల దొంగ ఓట్లతో గెలిచారని ఆరోపిస్తూ, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పార్టీ సంస్థాగత మార్పులపై స్పందిస్తూ, రాష్ట్ర కమిటీ మినహా మిగిలిన అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో చేపడతామని, సంఖ్య కంటే నాణ్యతకే ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో నాయకులకు, కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, త్వరలోనే వీటికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేస్తామని వివరించారు. ఇదే క్రమంలో కవిత 'టీఆర్ఎస్' పేరుతో పెట్టిన కొత్త పార్టీ గురించి ప్రస్తావించగా, రాజకీయాల్లో ఎన్నో పార్టీలు వస్తుంటాయని, పోతుంటాయని, వాటిని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న బీఆర్ఎస్ నాయకత్వం తెలంగాణకు ఎల్లప్పుడూ రక్షణ కవచంలా నిలబడుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

## బ్రేక్ అప్ తరవాత అత్యాచార కేసులు కుదరవు

### తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ, ఏప్రిల్27** : సహజీవనం తర్వాత అత్యాచారం కేసులు పెట్టడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. బ్రేక్-అప్ తర్వాత లైంగిక దాడి ఆరోపణలు వర్తించవని పేర్కొంది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం నేరం కిందకు రాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. పెళ్లి చేసుకోలేదని కక్షపూరితంగా కేసులు పెట్టడం సరికాదని ధర్మాసనం సూచించింది. తప్పుడు వాగ్దానం, విఫలమైన వాగ్దానాల మధ్య తేడాను గుర్తించాలని కేసు విచారణ సందర్భంగా పిటిషనర్‌కు తెలిపింది. ఈ మేరకు మహారాష్ట్ర న్యాయవాదిపై నమోదైన అత్యాచారం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇద్దరి వ్యక్తుల బంధంలో ప్రారంభం నుంచీ మోసపూరిత ఉద్దేశం ఉంటేనే నేరం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

# బంగారం మరింత పైకి

**మొదటిపేజీ తరువాయి..** పెరుగుదలను నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ గణాంకాల ఆధారంగా, 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 1,54,420 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,41,550 రూపాయలుగా ఉంది. ఇక తక్కువ స్వచ్ఛత కలిగిన 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా 1,15,820 రూపాయల వద్ద కొనసాగుతోంది. గత కొద్ది రోజులుగా బంగారం ధరలు ఒడిదుడుకులకు లోనవుతున్నప్పటికీ, తాజాగా మళ్లీ పెరుగుదల బాట పట్టడం సామాన్య వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో మార్కెట్లో డిమాండ్ పెరగడం, అదే సమయంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల మరియు డాలర్ విలువలో మార్పులు పసిడి ధరలకు రెక్కలు తెచ్చాయి. ముంబై సహా దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ఇదే తరహాలో ధరలు పెరిగాయి. ఇన్వెస్టర్లు సురక్షిత సాధనంగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతుండటంతో రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ధరల పెరుగుదల కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన బులియన్ మార్కెట్లపై ప్రభావం చూపుతోంది.

# ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ శాసనమండలి నూతన సభ్యులుగా ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని శాసనమండలి వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వీరిద్దరితో ప్రమాణం చేయించారు. ఈ అట్టహాసమైన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గ సహచరులు, ఇతర ప్రముఖ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటా కింద కోదండరాం, అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయగా, దీనిపై ఇటీవల గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వారిద్దరి ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది.

ప్రమాణస్వీకారం పూర్తి చేసిన అనంతరం ప్రొఫెసర్ కోదండరాం మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్ కార్యాచరణను వివరించారు. తనకు మంత్రి పదవులపై ఎలాంటి ఆశలు లేవని, రాజకీయాల్లో పదవులు అనేవి శాశ్వతం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తన పోరాట పటిమ గురించి కొందరు అనుమానాలు వ్యక్తం చేశారని, అయితే తాను పోరాడి నిరూపిస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అనేక కేసులు బనాయించి ఎన్నో ఇబ్బందులకు గురిచేసినప్పటికీ, ప్రజా సమస్యలపై తన పోరాటం ఏనాడూ ఆగలేదని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ రూపంలో తనకు ఒక గొప్ప వేదిక లభించిందని, వివాదాస్పద సమస్యలకు పరిష్కారం లభించినందుకు సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, ఆదివాసుల హక్కుల కోసం తన గళాన్ని వినిపిస్తానని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గతంలాగే తన జీవన శైలి సామాన్యంగా ఉంటుందని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కోదండరాం వెల్లడించారు.

మరోవైపు నూతన ఎమ్మెల్సీ మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, వారి అభ్యున్నతి కోసం తాను మరింత శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఎత్తుపల్లాలు సహజమని, వాటన్నింటినీ అధిగమించి ముందుకు సాగడమే ముఖ్యమని వ్యాఖ్యానించారు. కేవలం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ముస్లిం ఓట్ల కోసమే తనకు ఈ పదవి ఇచ్చారనే ప్రచారంలో వాస్తవం లేదని, సీఎం రేవంత్ రెడ్డి మొదటి నుంచీ మైనారిటీల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని అజారుద్దీన్ వివరించారు. రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధికి ఈ పదవి ద్వారా మరిన్ని సేవలు అందించే అవకాశం కలిగిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# రెండోవిడత ప్రచారానికి తెర

**మొదటిపేజీ తరువాయి..** నాటి నుండి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నానని, ఈ ఎన్నికల బాధ్యత కూడా అందులో భాగమేనని ఆయన వివరించారు. తనకు సొంతంగా ప్రత్యేక కుటుంబం లేదని, దేశంలోని 140 కోట్ల ప్రజలే తన కుటుంబమని పునరుద్ఘాటించారు. గత నాలుగు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నానని, తనకు ఈ ఎన్నికల రోడ్‌షోలు పుణ్యయాత్రలతో సమానమని వ్యాఖ్యానించారు.

అదే సమయంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)పై ప్రధాని ఘాటు విమర్శలు చేశారు. గతంలో అధికారంలోకి రావడానికి టీఎంసీ ఆయుధంగా చేసుకున్న 'మా-మాటి-మనుష్' నినాదాన్ని ఆ పార్టీ నేతలు ఇప్పుడు పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ఆ నినాదం ఎక్కడా వినిపించకపోవడం ఆశ్చర్యకరమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసిన టీఎంసీ నాయకులు కేవలం ప్రత్యర్థులను దూషించడం, బెదిరింపు రాజకీయాలకు పాల్పడటమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, నేరస్థులకు పాలకపక్షం అండదండలు లభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పడగానే అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

# భారీ క్రేన్ కూలీ ముగ్గురు కార్మికులు మృతి సిమెంట్ బ్రిక్స్ తయారీ పరిశ్రమలో ఘటన

**శంకర్‌పల్లి**

రంగారెడ్డి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. శంకర్ పల్లి మండలం మహాలింగాపురం సమీపంలోని ఏసీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో భారీ క్రేన్ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో అక్కడ మొత్తం పది మంది కార్మికులు విధులు నిర్వహిస్తుండగా, క్రేన్ కూలిన ధాటికి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్నం సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అకస్మాత్తుగా వీచిన బలమైన ఈదురు గాలుల కారణంగానే నియంత్రణ కోల్పోయిన క్రేన్ నేలకూలిందని, దీంతో కింద పనిచేస్తున్న కార్మికులు దాని శిథిలాల కింద చిక్కుకుపోయారని తోటి సిబ్బంది వివరించారు.

ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది, గాయపడిన వారిని శిథిలాల నుంచి వెలికితీసి అత్యవసర చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, దీనివల్ల మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు గాయపడిన వారందరూ కూడా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి పని చేసుకుంటున్న వలస కార్మికులుగా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. కంపెనీ యాజమాన్యం తీసుకున్న భద్రతా చర్యల లోపం ఏమైనా ఉందా లేదా ప్రకృతి వైపరీత్యం వల్లే ఈ ఘోరం జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా విచారణ చేపడుతున్నారు. ఈ విషాద ఘటనతో పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

## ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపులు

**మొదటిపేజీ తరువాయి..** రెండో టెర్మినల్‌లో బాంబు పెట్టినట్లు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందడంతో భద్రతా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ వార్త తెలిసిన వెంటనే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) అధికారులు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది అప్రమత్తమై రంగంలోకి దిగారు. బాంబు స్క్వాడ్ మరియు డాగ్ స్క్వాడ్ సహాయంతో టెర్మినల్‌లోని ప్రతి అంగుళాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణికులు ఉండే ప్రాంతాలు, లగేజీ సెక్షన్లు మరియు అనుమానాస్పద ప్రదేశాలన్నింటినీ జల్లెడ పట్టారు. సుదీర్ఘ తనిఖీల అనంతరం అక్కడ ఎటువంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభించకపోవడంతో అధికారులు అది నకిలీ బెదిరింపుగా నిర్ధారించారు.

ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి విచారణను వేగవంతం చేశారు. బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తి ఎవరు? ఆ మెయిల్ ఏ ప్రాంతం నుంచి వచ్చింది? అనే కోణంలో ఐపీ అడ్రస్ ఆధారంగా సాంకేతిక వివరాలను సేకరిస్తున్నారు. ఈ తరహా నకిలీ బెదిరింపులకు పాల్పడి భయాందోళనలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. తనిఖీల సమయంలో విమానాశ్రయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినప్పటికీ, విమానాల రాకపోకలకు మరియు సాధారణ సేవలకు ఎటువంటి పెద్ద అంతరాయం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. బాంబు బెదిరింపు ఉత్తుత్తిదేనని తేలడంతో విమానాశ్రయ సిబ్బందితో పాటు ప్రయాణికులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు ప్రస్తుతం విమానాశ్రయం వద్ద నిరంతర నిఘాను కొనసాగిస్తున్నారు.

## రాజ్యసభ ఎంపీల విలీనానికి గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి..**తమ పార్టీ ఎంపీలను కేంద్ర సంస్థల ద్వారా ఒత్తిడికి గురిచేసి, బలవంతంగా బీజేపీలో చేర్చుకున్నారని ఆరోపిస్తూ, సదరు ఏడుగురు సభ్యులపై అనర్హత వేటు వేయాలని ఆప్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ ఫిరాయింపులపై చట్టపరమైన పోరాటం చేస్తామని పార్టీ స్పష్టం చేసింది. అయితే, రాజ్యసభ ఛైర్మన్ ఈ అంశంపై న్యాయపరమైన సలహాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారం, ఒక పార్టీకి చెందిన శాసనసభ లేదా పార్లమెంటరీ పక్షంలో మూడింట రెండు వంతుల (2/3) మెజారిటీ సభ్యులు వేరే పార్టీలో విలీనమైతే, వారిపై అనర్హత వేటు పడదు. ఆప్ ఎంపీల సంఖ్యలో ఏడుగురు సభ్యులు కలిసి ఉండటం ఈ

# పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

❑ టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి


బీబీపేట్, ఏప్రిల్ 27 (జన సంఘర్షణ )
కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోని బిబిపేట్ మండల్ తుజాల్పూర్ గ్రామంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి సంబంధించిన వంట సామాగ్రి అందించిన టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ద్వారా నిరుపేదలకు అండగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నారు సొంత స్థలం లేని వారికి ఇల్లా నిర్మాణం కోసం త్వరలో ప్రభుత్వము ఒక ప్రకటన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మామిళ్ళ అంజన్న, జిల్లా ఉపాధ్యక్షులు, పంపరి లక్ష్మణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, గడ్డమీది మహేష్, క్రీడా అధ్యక్షులు నర్సాగౌడ్, మాజీ కౌన్సిలర్లు, సలీం, పిడుగు సాయిబాబా,మామిళ్ళ రమేష్, నర్సొల్ల మహేష్, వార్డ్ మెంబర్, కుమార్, యూత్ ప్రెసిడెంట్,ద్రావిడ్, కోటేశ్వర్ రాజశేఖర్, బండారి శ్రీకాంత్, నిరంజన్, రాహుల్ పాల్గొన్నారు.






# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి : సతీష్ ఖండేల్వాల్

❑ గోమాత రక్షణే మన ధర్మం






ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
'గౌ సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్'లో భాగంగా గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సతీష్ ఖండేల్వాల్ నేడు ఇల్లందులో చేపట్టిన ప్రచారం స్థానికులను ఆలోచింపజేస్తోంది. "నన్ను రక్షించండి" అని గోమాత స్వయంగా వేడుకుంటోందని, ముక్కోటి దేవతల నిలయమైన ఆవును పూజించే మనం, గోహత్యలు జరుగుతుంటే మౌనంగా ఉండటం మన సంస్కృతికే మచ్చ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నూతన గృహ ప్రవేశం వేళ గోవును సాదరంగా ఆహ్వానించే ప్రతి హిందువు, అదే గోమాత ప్రాణాపాయంలో ఉన్నప్పుడు రక్షించడానికి ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బస్సుల్లో ప్రయాణికులను కలిసి గోరక్షణపై అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. దేశవ్యాప్తంగా 8 వేల రెవెన్యూ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తున్నామని, సాధువులు, నాయకులు, హిందూ సమాజం అంతా కలిసికట్టుగా పోరాడి గోవును జాతీయ జంతువుగా సాధించుకోవాలని సతీష్ ఖండేల్వాల్ స్పష్టం చేశారు.

# అశ్వరావుపేటలో పెట్రోల్ డీజిల్ కొరత







27-4-2026 జన సంఘర్షణ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో అమెరికా ఇరాన్ యుద్ధం ప్రభావంతో పెట్రోల్ డీజిల్ గ్రామాలలో త్రివప్రవం చూపుతుంది. అశ్వరావుపేట ఆదివారం ఇండియన్ పెట్రోల్ కొరత ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు ఆటోలు కార్లు భారీ వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరి కొంతమంది వ్యక్తులు క్యాన్లు తీసుకువచ్చి వెళ్తుంటే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎమర్జెన్సీ వాహనాలకు కొట్టి పంపియాల్సిన యజమానివారే బాటిల్లో కొడుతూ పంపిస్తుంటే వాహనాలు మాత్రం ఎర్రటి ఎండలో ఇబ్బందికి గురవుతుంటే కొంతమంది క్యాన్లో కొట్టించుకొని ఏజెన్సీ ఏరియాకు తీసుకువెళ్లిలీటరుకు 150 నుంచి 200 వసూలు చేసుకున్నారు. వాహనాదారులు ఆపేసి క్యాన్లు కు కొడుతుంటే వాహనదారులు మాత్రం నిశ్చింతంగా ఉండిపోయారు. వాహనాలు తీసుకొని బంకు లోపలికి వెళ్లేసరికి నో స్టాక్ బోర్డు పెట్టి డీజిల్ అయిపోయింది. కొన్ని వాహనాలుకు 500 రూపాయలు కొట్టి మరి క్యాన్ లోకి 5000 రూపాయలు కొడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలకు మాత్రమే కొట్టి పంపించేలాగా చర్యలుతీసుకోమని వేడుకుంటున్నారు.

# దిండిగాలా నాయకత్వంలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)
ఇల్లందు పట్టణంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ వేడుకలు ఉద్యమ నాయకుడు దిండిగాలా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. పట్టణ, మండల నాయకులు పాల్గొని పలు ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దిండిగాలా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన ఉద్యమాన్ని స్మరించుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలో 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఉద్యమ పార్టీ, 14 సంవత్సరాల నిరంతర పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందని పేర్కొన్నారు. ఉద్యమ నాయకుడిగా ప్రారంభమైన కేసీఆర్, రాష్ట్ర రథసారథిగా మారి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపించారని అన్నారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమాంతరంగా నడిచాయని, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్‌మెంట్, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు వంటి పథకాల ద్వారా ప్రతి వర్గానికి మేలు జరిగిందని తెలిపారు. అలాగే కరెంట్ సమస్యలు, తాగునీటి కొరతలను అధిగమించి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని పేర్కొన్నారు. అందుకే ప్రజలు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా రావాలని ఆశిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా చౌక్‌లో దిండిగాలా రాజేందర్, కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో శీలం రమేష్, పదవ వార్డులో నారాపాక వసంత్ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. రంగనాథ్, మండల అధ్యక్షులు శీలం రమేష్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బౌసింగ్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి కంభంపాటి రేణుక, మాజీ వైస్ ఎంపీపీ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు సూరన్న, అనన్య, పద్మావతి, అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగీరథ లీకేజీకి ఎమ్మెల్యే చెక్.. క్షేత్రస్థాయిలో కదిలిన యంత్రాంగం!



ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకుల పర్యవేక్షణ ఉంటే పనులు ఎంత వేగంగా జరుగుతాయో ఇల్లందులో మరోసారి నిరూపితమైంది. స్థానిక రైల్వే బ్రిడ్జి సమీపంలో రెండు రోజుల క్రితం పగిలిన మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ వల్ల భారీగా నీరు వృథా అవుతున్న తరుణంలో, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నేడు స్వయంగా రంగంలోకి దిగారు. ఇప్పటికే మరమ్మతు పనులు కొనసాగుతున్నప్పటికీ, ఎమ్మెల్యే స్వయంగా క్షేత్రస్థాయికి చేరుకుని అధికారులతో సమీక్షించడంతో పనుల్లో వేగం పెరిగింది. వందలాది ఇళ్లకు వెళ్లాల్సిన రక్షిత జలం రోడ్లపాలవుతుండటంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని మున్సిపల్ మరియు భగీరథ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కౌన్సిలర్ అజ్మీర్ వంశీ నాయక్, కాంగ్రెస్ నేత జట్టి కిషోర్ పాల్గొన్న ఈ పర్యటన, ప్రజా సమస్యల పట్ల ప్రజాప్రతినిధుల అప్రమత్తతకు అద్దం పట్టింది.

# రామటాకీస్ సాక్షిగా గులాబీ జెండా పండుగ



కొత్తగూడెం ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
తెలంగాణ రాజకీయ యవనికపై ఒక ప్రభంజనంలా ఉద్భవించిన బిఆర్ఎస్ పార్టీ ప్రస్థానం నేటికి విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ రామటాకీస్ ఏరియాలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మిన్నంటాయి. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశానుసారం, వనమా రాఘవ పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాల్లో గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. బి. శ్రీను, శ్రీధర్, అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి మాట్లాడుతూ.. తెలంగాణ బాపు కేసీఆర్ రెండు దశాబ్దాల క్రితం రగిలించిన ఉద్యమ స్ఫూర్తి నేటికీ ప్రతి కార్యకర్తలో సజీవంగా ఉందని, స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన ఈ పార్టీ ప్రజాపక్షపాతిగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. కేవలం ఒక జెండా ఆవిష్కరణతో ఆగకుండా, ఉద్యమ కాలం నాటి ఆశయాలను స్మరించుకోవడం కార్యకర్తలకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. ఈ వేడుకల్లో మాజీ కౌన్సిలర్ అంబుల వేణు, పల్లపు రాజుతో పాటు వివిధ విభాగాల ఇంచార్జులు శివ, కిరణ్, పిల్లి కుమార్, సునీత, లచ్చిరాం, మైనార్టీ నేతలు జానీ భాయ్, సాధిక్ భాయ్, మొయ్యు సూరి, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, క్రమశిక్షణ గల సైనికుల్లా పార్టీ పటిష్టతకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

# హేమచంద్రపురంలో గులాబీ జెండా పండుగ

❑ కాంగ్రెస్ '420' హామీలపై బీఆర్ఎస్ గర్జన!




లక్ష్మీదేవిపల్లి ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, నియోజకవర్గ ఇంచార్జ్ వనమా వెంకటేశ్వరరావు ఆదేశాలతో హేమచంద్రపురంలో మండల పార్టీ అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు నేడు ఘనంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తన '420' అబద్ధపు హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజాక్షేత్రంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తరాల దామోదర్, మహేష్, ఇక్బాల్ పాషా, ఎర్రబడ్డీ శ్రీను, శ్రీకాంత్ నాయక్, తాడూరు రజాక్, పొదిలి వెంకటాచలం, చిర్రా వెంకన్నతో పాటు హేమచంద్రపురం, లక్ష్మీదేవిపల్లి మండల బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# భద్రాచలం గిరిజన యువతకు 'క్రికెట్' వరం

❑ ఎమ్మెల్యే తెల్లం చొరవతో మే 1 నుంచి ఉచిత శిక్షణ!



భద్రాచలం ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
గిరిజన యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు ప్రత్యేక చొరవతో, 'చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ' ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుండి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం కానుంది. కేవలం ఆట మాత్రమే కాకుండా, క్రీడాకారుల్లో ఫిట్‌నెస్, ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యం పెంపొందించేలా శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఈ అకాడమీలో శిక్షణ పొందిన వారు అండర్-12, 14 విభాగాల్లో రాష్ట్ర స్థాయికి ఎదిగారని, భవిష్యత్తులో గిరిజన యువత జాతీయ స్థాయికి చేరడమే తమ ఆశయమని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఐటిడిఏ పీఓ రాహుల్ ఐఏఎస్ మద్దతు ఈ కార్యక్రమానికి లభిస్తే మరింత మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భద్రాచలం డివిజన్‌తో పాటు జిల్లాలోని గిరిజన బాలబాలికలకు ఈ అరుదైన అవకాశాన్ని కల్పిస్తున్నట్లు అకాడమీ నిర్వాహకుడు రంజిత్, ప్రధాన కోచ్ తేజ వెల్లడించారు.

జన సంఘర్షణ

మంగళవారం
28 ఏప్రిల్ 2026

# విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వండి.. ఫీజు బకాయిలు చెల్లించండి

❑ **నిలిచిన ఉపకారవేతనాలు.. వీధిన పడ్డ విద్యార్థులు!**

కొత్తగూడెం ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)

రాష్ట్రంలో నిలిచిపోయిన విద్యా దీవెన, ఉపకారవేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారాస విద్యార్థి విభాగం నాయకులు సోమవారం కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కి విన్నపపత్రం సమర్పించారు. బత్తుల మధుచంద్, జూపెల్లి దుర్గాప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో వారు మాట్లాడుతూ..గత రెండేళ్లుగా నిధులు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. కళాశాల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని, 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెడుతోందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం దారుణమని, వెంటనే



బకాయిలు విడుదల చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

**ప్రభుత్వానికి హరిప్రసాద్ హెచ్చరిక**

ఎన్నికల సమయంలో 'గ్రీన్ ఛానల్' ద్వారా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా విద్యార్థుల గోడు వినకపోవడం దారుణమని హరిప్రసాద్ యాదవ్




విమర్శించారు. 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, ఇప్పటికైనా బకాయిలు విడుదల చేయకుంటే ఇల్లందు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి విద్యార్థిని ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ యాదవ్, సురేష్, రామారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఇల్లందులో ఇంధన సెగ కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్






❑ **రైతులకు, వాహనదారులకు మధ్య రగడ!**

ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)

పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద సోమవారం డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చడంతో ప్రధాన రహదారిపై కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్లాస్టిక్ క్యాన్లలో ఇంధనం నింపుతుండటంతో ఆగ్రహించిన వాహనదారులు, రైతులతో వాగ్వాదానికి దిగారు. ఎర్రటి ఎండలో గంటల తరబడి వేచి ఉన్న ప్రయాణికులు, నిబంధనలకు విరుద్ధంగా క్యాన్లకు డీజిల్ పోస్తున్న బంక్ నిర్వాహకుల తీరుపై మండిపడుతున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వివాదాన్ని సద్దుమణిగేలా చేసే ప్రయత్నం చేసినప్పటికీ, వాహనదారుల ఇక్కట్లు మాత్రం తప్పలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నిరంతర పర్యవేక్షణ ద్వారా కేవలం వాహనాలకే ఇంధనం సరఫరా అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# గోమాతకు జాతీయ హోదా కల్పించాలి: టేకులపల్లి తహసీల్దార్‌కు బీజేపీ వినతి

❑ **గోరక్షణకై బోడ పూనియా నాయక్ గళం**

టేకులపల్లి ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)




గోమాత ప్రాముఖ్యతను గుర్తించి, ఆవుకు 'జాతీయ మాత' హోదా కల్పించడంతో పాటు గోరక్షణకై కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమవారం టేకులపల్లి మండల తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ అభ్యర్థనను తహసీల్దార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్, దేశ ప్రధాని, రాష్ట్రపతికి చేరవేసి, తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బోడ పూనియా నాయక్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గోవుకు విశిష్ట స్థానం ఉందని, కానీ నేడు గోసంపద అంతరించిపోతుండటం




ఆందోళనకరమని అన్నారు. గోమాతను కేవలం జంతువుగా చూడకుండా, దానికి జాతీయ ఆరాధన, జాతీయ వారసత్వ హోదా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పూనియా నాయక్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా గోసేవ సమానంగా జరిగేలా రాజ్యాంగబద్ధమైన ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా భారతదేశంలో గోవధను పూర్తిగా నిషేధించాలని, గోవులను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాల్లో మార్పులు చేయాలని ఆయన హితవు పలికారు. గోరక్షణ అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించింది కాదని, ఇది దేశ సంపదను కాపాడుకోవడమేనని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఏకకాలంలో ఈ వినతులు అందజేయడం జరిగిందని పూనియా నాయక్ గుర్తు చేశారు. గోరక్షణ కోసం ఈరోజు ఒక గొప్ప ఉద్యమం మొదలైందని, దేశ చరిత్రలో ఇది ఒక ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గోమాత గౌరవం కాపాడే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొడ్డుపల్లి బ్రహ్మచారి, చిక్కా వెంకటేశ్వర్లు, నెల్లూరి సత్యం, బానోత్ గంగా, సబిత, గుగులోత్ నాగేందర్, బానోత్ శివ, సేవాలాల్ సేన రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణ నాయక్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైదానమే గెలుపు బాట: ఇల్లందులో వేసవి క్రీడా సంబరం!


ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)



కేవలం పుస్తకాల పురుగుల్లా మారిపోతున్న నేటి తరానికి మైదానమే అసలైన పాఠశాల కావాలని, క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాదు, ఓటమిని తట్టుకుని నిలబడే మానసిక ధైర్యాన్ని కూడా ప్రసాదిస్తాయని సింగరేణి ఎస్ఓ-టు-జీఎం రామస్వామి ఉద్ఘాటించారు. సోమవారం ఇల్లందులోని 'రన్స్ అండ్ గోల్స్' స్టేడియంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించిన వేళ, క్రీడల ప్రాముఖ్యతపై చేసిన ప్రసంగం ఆలోచింపజేసేలా సాగింది. స్మార్ట్ ఫోన్ల యుగంలో పిల్లలు నాలుగు గోడలకే పరిమితం కాకుండా, సింగరేణి సంస్థ కల్పిస్తున్న ఈ అద్భుత అవకాశాన్ని వాడుకుని ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వం కేవలం మైదానంలోనే అలవడతాయని, అవే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి ఈ వేసవిని ఒక నైపుణ్యాన్ని పెంచుకునే వేదికగా మార్చుకోవాలని ఆకాంక్షించారు.

# భద్రాద్రిలో స్థానిక పోరుకు సై: ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా యంత్రాంగం!

కొత్తగూడెం ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం నేడు సమరశంఖం పూరించింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఓటరు జాబితాల రూపకల్పన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 1,271 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తుండగా, బ్యాలెట్ బాక్సుల సేకరణను కూడా వేగవంతం చేశారు. ఇప్పటికే 1,811 చిన్నవి, 351 మీడియం సైజు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసి ఉంచిన అధికారులు, రిపేర్లు అవసరమైన బాక్సులపై ప్రత్యేక దృష్టి సారించారు. నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేలా ఎన్నికల సామగ్రిని, యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తూ జిల్లాలో ఎన్నికల వేడిని పెంచారు.

# ఇల్లందులో ఎరువుల దుకాణాలు బంద్

❑ **ఇల్లందులో ఆగని ఎరువుల 'మంట': కంపెనీల లింకు దందాపై డీలర్ల సమ్మె సైరన్!**

ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)




ఎరువుల కంపెనీల ఏకపక్ష నిర్ణయాలు, డీలర్లపై మోపుతున్న అదనపు భారాన్ని నిరసిస్తూ, రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఇల్లందు ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ సోమవారం పట్టణంలో సంపూర్ణ బంద్ పాటించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాళ్ల సోమసుందర్, మండల అధ్యక్షుడు పొద్దుటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రధాన ఎరువులతో పాటు అవసరం లేని 'లింకు ప్రొడక్టులను' బలవంతంగా అంటగడుతూ, రవాణా చార్జీల భారాన్ని తమపై మోపుతున్నారని, కానీ కమిషన్లు మాత్రం పెంచడం లేదని మండిపడ్డారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలన్నీ మూతపడటంతో అమ్మకాలు పూర్తిగా స్తంభించగా, డీలర్లు నారాయణదాసు లాహోటి, ఆంజనేయులు, ఉపేందర్ తదితరులు కంపెనీల వైఖరిని ఎండగట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఈ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# దిండిగాలా నాయకత్వంలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)




ఇల్లందు పట్టణంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ వేడుకలు ఉద్యమ నాయకుడు దిండిగాలా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. పట్టణ, మండల నాయకులు పాల్గొని పలు ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దిండిగాలా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన ఉద్యమాన్ని స్మరించుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలో 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఉద్యమ పార్టీ, 14 సంవత్సరాల నిరంతర పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందని పేర్కొన్నారు. ఉద్యమ నాయకుడిగా ప్రారంభమైన కేసీఆర్, రాష్ట్ర రథసారథిగా మారి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపించారని అన్నారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమాంతరంగా నడిచాయని, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్‌మెంట్, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు వంటి పథకాల ద్వారా ప్రతి వర్గానికి మేలు జరిగిందని తెలిపారు. అలాగే కరెంట్ సమస్యలు, తాగునీటి కొరతలను అధిగమించి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని పేర్కొన్నారు. అందుకే ప్రజలు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా రావాలని ఆశిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా చౌక్‌లో దిండిగాలా రాజేందర్, కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో శీలం రమేష్, పదవ వార్డులో నారాపాక వసంత్ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. రంగనాథ్, మండల అధ్యక్షులు శీలం రమేష్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బౌసింగ్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి కంభంపాటి రేణుక, మాజీ వైస్ ఎంపీపీ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు సూరన్న, అనన్య, పద్మావతి తదితరులు, అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాచలం దేవస్థానం భూముల పంచాయతీకి మోక్షం!

భద్రాచలం ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)

భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన పురుషోత్తపట్నం భూముల వివాదం ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. సోమవారం ఎటపాకలో ఆలయ అధికారులతో జరిగిన భేటీలో, 2018 నుంచి నిలిచిపోయిన సాగు రుసుములను (డ్యామేజ్ చార్జీలను) చెల్లించేందుకు రైతులు అంగీకరించారు. గత ఎనిమిదేళ్లుగా కోర్టు కేసుల కారణంగా 372 మంది రైతులు 650 ఎకరాలకు సంబంధించిన బకాయిలను నిలిపివేశారు. దీనివల్ల ఆలయానికి భారీగా ఆదాయ గండి పడుతుండటంతో, అధికారులు నిరంతరం చర్చలు జరిపారు. తాజాగా రైతులు సానుకూలంగా స్పందించడంతో అటు దేవస్థానానికి ఆర్థిక ఊరట, ఇటు రైతులకు సాగు హక్కు లభించినట్లయింది.



శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా - తెలంగాణ
SREE SEETHA RAMACHANDRA SWAMY VARI DEVASTHANAM
BHADRACHALAM, BHADRADRI KOTHAGUDEM DISTRICT - TELANGANA

Ref : ఆర్.సి. నం.బి2/145/2009 Date : 27.04.2026

ప్రెస్ నోట్

ఈ దేవస్థానం హక్కుభుక్తంలో ఉన్న పురుషోత్తపట్నం గ్రామం,ఎటపాక మండలం,పోలవరం జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందలి భూములలో ఉన్న రైతులు 2017-18 వరకు 650 ఎకరాలకు సుమారుగా 372 మంది రైతులు యూజ్ & అక్యుపేషన్ చార్జెస్‌ను ఎకరాకు రూ॥2,750/-లు చొప్పున చెల్లించుట జరిగినది. తదుపరి రైతులు అనివార్య కారణముల వలన కోర్టులో కేసులు దాఖలు చేయుట వలన 2018-19 ఆర్థిక సం॥రం నుండి దేవస్థానమునకు డ్యామేజ్‌చార్జెస్ చెల్లించుట నిలుపుదల చేసియున్నారు. దేవస్థానంనకు భూమిపరంగా, ఆర్థికంగా నష్టం జరుగుచున్నందున, పై భూముల విషయంలో సుమారుగా 8 సం॥లుగా ఎటువంటి పురోగతి లేనందున, ప్రస్తుతం రైతులు, దేవస్థాన ఆర్థిక స్థితిగతులు, భూరక్షణలో భాగంగా కార్యనిర్వహణాధికారి వారు, పురుషోత్తపట్నం రైతులతో పలు పర్యాయములు సమావేశములు నిర్వహించుట జరిగినది.

మరలా ది.27.04.2026న జరిగిన సమావేశము నందు పురుషోత్తపట్నం రైతులు, 2018-19 సం॥రం నుండి నేటివరకు పెండింగ్ నందున్న డ్యామేజ్‌చార్జెస్ కూడా చెల్లించి వ్యవసాయం చేసుకొనుటకు అంగీకారము తెలిపియున్నారు.

శ్రీరామ కార్యంలో...
సం/- కె. దామోదర్ రావు
కార్యనిర్వహణాధికారి

//అసలుకు సరియైన నకలు//

సహాయ కార్యనిర్వహణాధికారి

# 32మంది గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -27(జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి హెల్త్ వెల్ నెస్ సెంటర్లో గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శరత్ అన్నారు. ఇందులో 32మంది గర్భిణీలు హాజరయ్యారని అన్నారు. బిపి హెచ్బి పరీక్షలు ఆర్ బి ఎస్ టెస్ట్ లో, క్యాల్షియం ఐరన్ ఫోలిక్యాసిడ్ మాత్రలు ఇవ్వడం ప్రతినెలా మూడో నెల 5వ నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. రక్తం తక్కువగా ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్స్ డబల్ డోర్స్ వేసుకోవాలని,ఆకుకూరలు కూరగాయలు పండ్లు క్యారెట్ బీట్రూట్ పల్లి పట్టీలు తీసుకోవాలని చెప్పడం జరిగిందని రక్తం తక్కువగా ఉన్నవారికి ఐరన్ శుక్రుజులు పెట్టించడం జరిగింది పేర్కొన్నారు. గర్భిణీలకు డైలీ మధ్యాహ్నం రెండు గంటల విశ్రాంతి తీసుకోవాలని విశ్రాంతి తీసుకో చెప్పడం వ్యాయామం యోగ మెడిటేషన్ చేయాలని కోరారు.

## ఘనంగా బారాసా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

◆ **పార్టీ జెండా ఎగురవేసిన పట్టణ అధ్యక్షులు**



ఎల్లారెడ్డి, ఏప్రిల్ -27(జన సంఘర్షణ )
భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని 26వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ జెండాను సోమవారం పట్టణ కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఫామ్ వద్ద బారాస జెండాను పట్టణ అధ్యక్షులు ఆదిమూలం సతీష్ కుమార్ ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన ఉద్యమ పార్టీ బారసా అని ఆయన పేర్కొన్నారు తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని చివరగా తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న ఘనత బారాస పార్టీకి దక్కిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా చాలా వెనకబడుతుందని దానికి కారణం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విధానమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు గత పది సంవత్సరాలలో తెలంగాణను దేశంలోని అగ్రరాష్ట్రంగ పేరు తెచ్చుకున్నామని ఇప్పుడు పాలకుల నిర్లక్ష్యం వలన అడుగడుగున తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాట్లు గౌరవ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు ఎంతగానో నిరంతరం శ్రమించి సంబండా వర్గాలను ఏకం చేసి విద్యార్థి సంఘాలతో కుల సంఘాలతో మమేకమై రాష్ట్ర సాధన కోసం అందర్నీ కలుపుకొని అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్రాన్ని దక్కించుకున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ మాజీ అధ్యక్షులు ఏగుల నర్సింలు ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మిశివనంది, శ్రావణ్,అమీర్, దేవదాస్, ఎరుకల సాయిలు, రఫిక్, రవి, నాగం రాజయ్య, అరవింద్ గౌడ్, నాగరాజ్, అన్నం శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

◆ **ఇల్లందు డీఎస్పీకి బీజేపీ నేతల సత్కారం**



ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో రక్షక భట వ్యవస్థ పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని పేర్కొంటూ, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబును సోమవారం బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం డీఎస్పీని శాలువాతో ఘనంగా సత్కరించి, నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. చట్టాన్ని గౌరవించే సమాజం నిర్మించడంలో ప్రజలు, పోలీసులు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరముందని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి భూక్య రవి నాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మావునూరి మాధవ్, నియోజకవర్గ ఇంచార్జ్ బలగాని గోపి కృష్ణ, మండల అధ్యక్షుడు భట్టు రమేష్ పాల్గొని.. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులకు రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలపడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని చాటిచెప్పారు.

## హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

◆ **గోమాతని జాతీయ జంతువుగా ప్రకటించాలి.**
◆ **తహసిల్దార్ కి వినతి పత్రం అందజేత...**

నస్రుల్లాబాద్:/ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)






భారతీయ సంస్కృతిలో గోవును గోమాతగా ఆరాధిస్తూ, ఆరాధ్య దైవంగా భావిస్తున్నారని హిందూ సంఘాలు తెలిపాయి. గోమాత పవిత్రత, ఆర్థిక ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ఆధ్వర్యంలో హిందూ సంఘాల నాయకులు భజనలు చేసుకుంటూ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ స్థానిక హనుమాన్ ఆలయం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ తహసీల్దార్ సువర్ణ కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందువులు ఆరాధ్య దైవంగా భావించే గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, గో హత్య నివారణకు కఠినమైన చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, హిందూ సోదరులు సాయాగౌడ్ , సూర్య ప్రకాష్, సున్నం సాయిలు, వడ్ల సతీష్ , హన్మండ్లు , శంకర్ నాయక్, చౌదరి, అరిగె సాయిలు, నందు పటేల్, నరేష్ పటేల్, లింగం గౌడ్, శివ ప్రసాద్, అయినాల లింగం, గణేష్ కుమార్, అరిగే నారాయణ, గంగాధర్, మైసా గౌడ్, భాను ప్రకాష్ గౌడ్, గోవర్ధన్ సేట్ , శివ , రవి సేట్, ప్రకాష్ సేట్, సాకలి సాయిలు, రాము, రాఘవ, రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లిఖార్జున్, బాలయ్య, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దండకారణ్యంలో 'బంగారు' కురిపిస్తున్న విప్పపువ్వు

◆ **ఆదివాసీల అస్తిత్వానికి ప్రతీక!**

భద్రాచలం ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
భద్రాచలం ఏజెన్సీలోని దండకారణ్యం ఇప్పుడు విప్పపువ్వు సువాసనలతో పులకించిపోతోంది. వేసవి సూర్యుడు సెగలు గక్కుతున్నా, అడవి బిడ్డలకు మాత్రం ఇది పండుగ కాలం. ఆదివాసీల సంస్కృతిలో, వారి ఆర్థిక మూలాల్లో 'విప్పపువ్వు' (ఇప్పపువ్వు) ఒక విడదీయలేని భాగం. తెల్లవారుజామున కోయిల కూతకంటే ముందే, గిరిజన పల్లెల్లోని చిన్న పెద్ద అంతా కలిసి బుట్టలు పట్టుకుని అడవి బాట పడుతున్నారు.





**సంస్కృతిలో భాగం.. దేవతా ప్రసాదం**



ఆదివాసీలకు విప్ప చెట్టు కేవలం ఒక వృక్షం కాదు, అది వారి నమ్మకం. పుట్టుక నుంచి చావు వరకు జరిగే ప్రతి శుభకార్యంలోనూ విప్పపువ్వు ఉండాల్సిందే. వారి ఆరాధ్య దైవాలకు సమర్పించే నైవేద్యాల్లో దీనికి అగ్రతాంబూలం ఉంటుంది. తమ సంప్రదాయ పానీయమైన విప్ప సారాయిని అతిథులకు మర్యాదపూర్వకంగా అందించడం గిరిజన ఆచారంలో ఒక భాగం.

**అడవి ఇచ్చిన పోషకాహారం**

ప్రకృతి సిద్ధంగా దొరికే ఈ విప్పపువ్వులో అద్భుతమైన ఔషధ గుణాలున్నాయి. ఈ పువ్వులతో తయారుచేసే లడ్డూలు, బర్ఫీలు గిరిజన బాలింతలకు, చిన్నారులకు ఎంతో బలాన్ని ఇస్తాయి. నేటి ఆధునిక కాలంలో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. విప్ప నూనెను వంటల్లోనే కాకుండా, చర్మ వ్యాధుల నివారణకు కూడా గిరిజనులు ఉపయోగిస్తారు.

**ఆర్థిక అండ.. ప్రకృతితో మమేకం**

ఎండబెట్టిన విప్పపువ్వు అటవీ ప్రాంతాల్లో 'నల్ల బంగారం'గా పిలవబడుతుంది. వీటిని సేకరించి, ఇసుక రేణువు కూడా తగలకుండా జాగ్రత్తగా శుభ్రం చేసి, ఎండబెట్టి విక్రయించడం ద్వారా గిరిజన కుటుంబాలకు చేతినిండా ఆదాయం లభిస్తోంది. అటవీ ఉత్పత్తుల సేకరణలో వీరు ప్రదర్శించే ఓర్పు, ప్రకృతిని వారు గౌరవించే తీరు నిజంగా అభినందనీయం. దూరంగా వినిపించే డోలు దరువులు, విప్పపువ్వు పరిమళాల మధ్య ఆదివాసీల జీవనం ప్రకృతితో పెనవేసుకున్న ఒక మధుర కావ్యంలా సాగుతోంది. ఈ అటవీ సంపదను కాపాడుకుంటూ, వారి ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పిస్తే గిరిజన బతుకుల్లో మరింత వెలుగు నిండుతుంది.

# ఇల్లందులో మిన్నంటిన గులాబీ సంబరాలు

◆ **కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష**



ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఇల్లందు పట్టణంలో అత్యంత వైభవంగా జరిగాయి. పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుని 26వ ఏట అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో ఇల్లందు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా, ఉద్యమ నాయకుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పార్టీ జెండాలను ఆవిష్కరించి, మిఠాయిలు పంపిణీ చేస్తూ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు ధనాల వాసు మాట్లాడుతూ.. 2001లో కేసీఆర్ ప్రారంభించిన ఉద్యమ ప్రస్థానం తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు, గడిచిన పదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తునే మార్చేసిందని కొనియాడారు. కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు నిజమైన రక్షణ లభించిందని, రైతుబంధు, ఆసరా పెన్షన్ వంటి విప్లవాత్మక పథకాల ద్వారా ప్రతి సామాన్య కుటుంబానికి మేలు జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా మళ్ళీ కేసీఆర్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో దిండిగాల రాజేందర్, శీలం రమేష్, ఎస్. రంగనాథ్, అబ్దుల్ నబీ, బౌసింగ్ నాయక్, కంభంపాటి రేణుకలతో పాటు కౌన్సిలర్లు సూరన్న, అనన్య, పద్మావతి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భరోసా సెంటర్ ఆధ్వర్యంలో చైల్డ్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహణ





నిజామాబాద్ టౌన్ . (ఏప్రిల్ 27 . (జన సంఘర్షణ )
నేడు నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య, ఆదేశానుసారముగా నిజామాబాద్ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చైల్డ్ సేఫ్టీ అంశంపై బోగాం(పి) గ్రామపంచాయతీ పరిధిలో డి.ఆర్.డి.ఏ ఐకేపీ మండల సమాఖ్య సమావేశంలో రెండు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలలో గ్రామ ప్రజలు 90 మంది, డి.ఆర్.డి.ఏ ఐకేపీ మండల సమాఖ్య సమావేశంలో 45 మంది సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, అంగన్వాడీ టీచర్లు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, బాలల రక్షణ, లింగ సమానత్వం, పితృస్వామ్యం, జెండర్ బైయాస్, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, భరోసా సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, పితృస్వామ్య భావనల, జెండర్ వివక్షను గుర్తించి ఎదుర్కోవాలని, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, బాల్య వివాహాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోగాం(పి) కార్పొరేటర్ నరేష్, డి.ఆర్.డి.ఏ ఐకేపీ ఏపీఎం శారద, భరోసా సిబ్బంది డబ్ల్యూఎస్ఐ పుష్పావతి, కో-ఆర్డినేటర్ రోజా, సపోర్ట్ పర్సన్ సవిత, ఏఎన్ఎం మమత పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను గ్రామ స్థాయిలో మరింత విస్తరించాలని తెలిపారు.

# గోమాతకు జాతీయ గౌరవం దక్కాలి

◆ **దేశవ్యాప్తంగా తహసిల్దార్లకు వినతిపత్రాల అందజేత**

ఇల్లందు ఏప్రిల్ 27 (జన సంఘర్షణ)
భారతీయ జీవన విధానంలో గోవుకు ఉన్న విశిష్టతను చాటిచెబుతూ, గోరక్షణ కోసం కఠినమైన చట్టాలు అమలు చేయాలనే సంకల్పంతో సోమవారం దేశవ్యాప్తంగా 'గో సమ్మాన్ ఆహ్వాన అభియాన్' కార్యక్రమం ఉధృతంగా సాగింది. కేవలం మతపరమైన కోణంలోనే కాకుండా, దేశ ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలో గోవు ప్రాధాన్యతను గుర్తించాలని కోరుతూ ప్రతి మండల కేంద్రంలోని తహసిల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఈ అభ్యర్థనలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్, ప్రధాని నరేంద్ర మోడీ మరియు భారత రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం కేవలం కొద్దిమంది వ్యక్తుల నిరసనగా కాకుండా, సామాన్య ప్రజల ఆకాంక్షగా ప్రతిబింబించింది. గోమాతను ప్రేమించే, రక్షించాలని తపించే వేలాది మంది ప్రజల నుంచి సేకరించిన సంతకాలను ఈ వినతిపత్రాలకు జత చేయడం గమనార్హం. గోసంరక్షణ అనేది ఒక చట్టబద్ధమైన బాధ్యతగా మారాలని, అప్పుడే క్షేత్రస్థాయిలో మార్పు సాధ్యమవుతుందని ఈ సందర్భంగా నిర్వాహకులు బలంగా వినిపించారు. ప్రజల నుంచి వచ్చిన ఈ భారీ స్పందన, గోరక్షణ పట్ల సమాజంలో ఉన్న నిబద్ధతను చాటిచెబుతోంది. ఈ అభియాన్ యొక్క మరో విశిష్ట అంశం ఏమిటంటే, దీనికి గోమాతనే ప్రధాన పోషకులుగా నంది బాబాను అధ్యక్షులుగా ప్రకటించడం. ఆధ్యాత్మికతను బాధ్యతతో ముడిపెడుతూ సాగిన ఈ కార్యక్రమంలో సతీష్ కండెల్వాల్, మామిడి జయప్రకాష్, డికె శ్రీనివాస్, నాని, సతీష్ కుమార్, నరసింహారెడ్డి, విష్ణు వంటి ప్రముఖులతో పాటు పెద్ద సంఖ్యలో గోభక్తులు పాల్గొన్నారు. "మనం గోవును పూజించే దేశంలో ఉన్నామా లేక కేవలం ఉపన్యాసాలకే పరిమితమయ్యామా?" అనే ప్రశ్నను ఈ కార్యక్రమం పాలకుల ముందు ఉంచింది. చివరగా, గోవుల రక్షణ కోసం ప్రస్తుతమున్న చట్టాలను మరింత బలోపేతం చేయాలని, అక్రమ రవాణా, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. మండల స్థాయి నుంచి ఢిల్లీ పీఠం వరకు ఈ స్వరం వినిపించేలా ప్రణాళికాబద్ధంగా సాగిన ఈ అభియాన్, రాబోయే రోజుల్లో గోరక్షణ ఉద్యమానికి కొత్త దిశను చూపేలా కనిపిస్తోంది. గోమాతకు దక్కాల్సిన గౌరవం కేవలం కాగితాల మీద కాకుండా, క్షేత్రస్థాయిలో అమలు కావాలని గోప్రేమికులు ముక్తకంఠంతో నినదించారు.





జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
28 ఏప్రిల్ 2026

# నియోజకవర్గానికి మరిన్ని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే

హైదరాబాద్, ఏప్రిల్ 27- (జన సంఘర్షణ )

హైదరాబాద్‌లోని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , మంత్రి సీతక్క, హౌసింగ్ ఎండీ గౌతమ్ తో కలిసి నిర్వహించిన కీలక సమీక్ష సమావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్లు 2బీహెచ్ కే హౌసింగ్ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చ జరిగింది. పథకాల అమలు వేగవంతం చేసి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారు అధికారులను ఆదేశించారు. అలాగే నియోజకవర్గానికి మరిన్ని ఇళ్ల మంజూరు ఇవ్వాలని మంత్రిని కోరారు.

**పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యం**

లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.

**లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరింపు**

ఈ పథకాల ద్వారా ఇళ్ల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. "మాకు స్వంత ఇల్లు వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశం మా జీవితంలో కొత్త ఆశలు నింపింది" అని పలువురు లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

పనులను వేగవంతం చేసి, గృహాల పంపిణీని సమయానికి పూర్తి చేయాలని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన ముఖ్య సమస్యలు




**బిల్లుల సమస్య:**

2014కు ముందు ఇల్లు మంజూరు అయ్యిందనే కారణంతో ప్రస్తుతం మంజూరు పొందిన వారికి బిల్లులు రావడం లేదని, దీనిని వెంటనే పరిష్కరించాలని కోరారు. తాండాలలో ఫారెస్ట్ అడ్డంకులు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తాండాలు ఎక్కువగా ఉండటంతో, అక్కడ గుడిసెల స్థానంలో ఇళ్లు నిర్మించేందుకు ఫారెస్ట్ శాఖ నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించి గిరిజనులకు గృహ నిర్మాణానికి అనుమతులు కల్పించాలని మంత్రిని కోరారు.

# కాళ్లు మొక్కుతా సార్... గన్ని బస్తాలు ఇప్పించండి

- ఓ మహిళ ఎస్సై కాళ్ళ మీద పడి
- గన్ని బస్తాలు లేక నిలిచిపోయిన ధాన్యం కొనుగోలు
- చోద్యం చేస్తున్న అధికారులు
- అకాల వర్షాలతో అన్నదాత ఆందోళన
- పట్టింపు లేని పాలకులు

బీర్కూర్ /ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)

కాలు మొక్కుతా సార్.. గన్ని బస్తాలు ఇప్పించండి. ధాన్యం కోసి నెల రోజులు కావస్తున్న. గన్ని బస్తాలు ఇవ్వక ధాన్యమంతా ఎండిపోతుంది అంటూ ఓ మహిళ ఎస్సై ముందు కన్నీటి పర్వతమయ్యారు. గన్ని బస్తాలు ఇవ్వడంలో అధికార యంతరంగం, పాలకులు చేస్తున్న నిర్లక్ష్యం వల్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గన్ని బస్తాలు లేక కొనుగోలు నిలిచిపోయాయి, మరోపక్క హమాలీల కొరత రైతులను తీవ్రంగా వైదిస్తుంది. రైతులను రాజులను చేస్తామని గొప్పగా చెప్పుకుంటున్న



ముఖ్యమంత్రి మొదలుకొని, మంత్రులు, ఎమ్మెల్యేల వరకు రాజులను కాదు వాళ్లని రోడ్లు పాలు చేస్తున్నారు ఈ పాలకులు. నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట్, కామారెడ్డి, మెదక్, మహబూబ్నగర్, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి జిల్లా, నిర్మల్, అదిలాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట్, జిల్లాలో కొనుగోలు కేంద్రాలు వేగవంతంగా కొనసాగు పోవడంతో పెద్ద ఎత్తున ధాన్యం రాశులు రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. మరొకపక్క పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని దీనికోసం 148 లక్షల టన్నుల దాన్యం దిగుబడి రావచునని అంచన వేసినప్పటికీ దానికి అనుగుణంగా గన్ని బస్తాలు అందించడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైంది. 16 కోట్లకు పైగా గన్ని బస్తాలను అందుబాటులో ఉంచామని పెద్దగా చెప్పుకుంటున్నాం మంత్రులు క్షేత్రస్థాయిలో ఆ స్థాయిలో గన్ని బస్తాలు లేకపోవడంతో ఎక్కడికక్కడ ధాన్యం కొనుగోలు నిలిచిపోయాయి. ఇప్పటికే పలుచోట్ల అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి ముద్దయి పనికిరాకుండా పోవడంతో అన్నదాత గుండె పగిలేలా ఏడుస్తున్నారు అయినప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి కళ్ళు తెరవకపోవడం అన్నదాతకు శాపంగా మారింది. స్థానిక ఎమ్మెల్యేలు సైతం కొనుగోలు కేంద్రాలు ఏ విధంగా కొనసాగుతున్నాయి అన్నది క్షేత్రస్థాయిలో చూడకుండా కేవలం కలెక్టర్లకు, తాసిల్దార్లకు. శాఖ అధికారులకు అప్పగించి చేతులు దులుపుకున్నారు. గన్ని బస్తాలు లేనిది తాము ఏం చేయాలంటూ అధికారులు తలబాదుకుంటున్నారు. దీంట్లో ఎవరిది నిర్లక్ష్యం. రైతులను ఇబ్బందుల పాలు చేయడం ఎవరి పాపం.



అరగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకుందామని సహకార సంఘం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువస్తే అక్కడ గన బస్తాలు లేవు అంటూ బీర్కూర్ సహకార సంఘం లో పనిచేసే కార్యదర్శులు మొదలుకొని, కిందిస్థాయి సిబ్బంది వరకు రైతుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. అత్యవసర సమయంలో సహకార సంఘం కార్యదర్శి సెలవు పై వెళ్లడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టరాజ్యం కొనసాగుతుంది. కొంతమంది సహకార సంఘంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది బడా రైతులతో కుమ్మక్కై వారికి వేలాది గన్ని బస్తాలు అందజేస్తూ, చిన్న సన్న కారు రైతులకు గన్ని బస్తాలు ఇవ్వకపోవడంతో రైతులు వారి పనితీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున రైతులు సహకార సంఘం కు తరలివచ్చి అధికారుల పనితీరుపై మండిపడ్డారు. సహకార సంఘాన్ని ముట్టడించారు. ఇంతమంది సిబ్బంది వాడికి ఇష్టమైన వారికి డబ్బులు దండుకుంటూ పెద్ద ఎత్తున గన్ని బస్తాలు అందజేస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. వేలాది బస్తాలు ఉన్న బడా రైతులకు గన్ని బస్తాలు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తూ, చిన్న సన్నకారు రైతుల ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికే బీర్కూర్లో 25వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, సహకార సంఘం నిర్వాహకుల, పాలకులు, సివిల్ సప్లై అధికారులు రైతులు కావలసిన గన్ని బస్తాలు ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల, ఆరాగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాల వల్ల దెబ్బతిని ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బీర్కూర్ కు అన్నదాతలను అండగా నిలవడానికి అధికార పార్టీకి చెందిన ఏ నాయకుడు సక్రమంగా లేకపోవడంతో రైతులే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు రైతులకు అండగా నిలువలేక పోవడంతో దిక్కుతోచని పరిస్థితి రైతులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు సివిల్ సప్లై అధికారులు రైతులకు కావలసిన గన్ని బస్తాలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నారు. దీనికి తోడు దశాబ్దాల కాలంగా బాన్సువాడ నియోజకవర్గంలో మంత్రిగా, శాసన సభాపతిగా ఎమ్మెల్యేగా విధులు నిర్వహిస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి గాని ఆగ్రో పరిశ్రమల చైర్మన్ కాసుల బాలరాజ్ పట్టించుకోకపోవడం వల్ల రైతుల పరిస్థితి దారుణంగా మారింది . రోజుకు వాతావరణం లో మార్పులు రావడం వల్ల ఏ సమయంలో అకాల వర్షాలు, వడగళ్ల వాన కురిసే ప్రమాదం ఉందని దీనివల్ల తమ ధాన్యమంతా తడిసి ముద్ద అవుతుందని అన్నదాత కంటిమీద కుంకు లేకుండా గన్ని బస్తాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. స్థానికంగా ఏ నాయకుడు కూడా అన్నదాతకు అండగా నిలవకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. విగ్రహాలకు దండాలు వేయడానికి పోటీ పడుతున్న అధికార పార్టీ నాయకులు, అన్నదాత ఎదుర్కొంటున్న గన్ని బస్తాల సమస్య తీర్చమన్న ఆలోచన లేకపోవడం అన్నదాతలు చేసుకున్న పాపం అయింది. పక్క రెవిన్యూ అధికారులు పత్తా లేకుండా పోయారు వ్యవసాయ అధికారులు అందుబాటులో లేకపోవడంతో బాన్స్వాడ నియోజకవర్గంలోనే అత్యధికంగా ధాన్యం పండించే బీర్కూర్ మండలంలో గన్ని బస్తాలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించి రైతులు కావలసిన గన్ని బస్తాలను అందజేసి, కొనుగోలు కేంద్రాలను పెంచి తక్షణం రైతుల వద్ద ఉన్న ప్రతి గింజలు కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల అప్పుడే రైతులు పాలకులకు గుర్తుకు వస్తారు, ఎన్నికలు కాగానే గద్దెనెక్కిన పాలకులు, స్థానిక నాయకులు అన్నదాతలను మర్చిపోవడంతో అన్నదాత పరిస్థితి ఆ గమ్య గోచరంగా మారింది.

# బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

పొతంగల్/ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)





పొతంగల్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ 26వ. ఆవిర్భవ దినోత్సవ వేడుకలను మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ 26వ. వసంతంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంగా పార్టీ అధ్యక్షులు ఎం.ఏ సమీర్ భారత రాష్ట్ర సమితి జెండాను ఆవిష్కరించారు. అనంతరం బి పార్టీ మండల నాయకులు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ.... 2001 వ సంవత్సరంలో కెసిఆర్ ఒక్కడై తెలంగాణ రాష్ట్రం కోసం ఆనాడు పదవులను గడ్డిపరకల వదిలిన మహా నాయకుడు అని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం ఆయన ఢిల్లీ గోడలను బద్దలు కొట్టి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న మహా గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల కోసం తెలంగాణ పార్టీ స్థాపించి ఎన్నో ఉద్యమాలను చేపట్టి తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉండి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలలో నడిపించిన నాయకుడు కెసిఆర్ అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాలకు చేతను ఇస్తూ అభివృద్ధి బాటలో నడిపించిన నాయకుడు అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు విరక్తి చెంది పార్టీలోని సీనియర్ నాయకులను పార్టీనీ విడుతున్నారని పేర్కొన్నారు. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టేది గులాబీ జెండా బిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు హరీష్ రావు కేటీఆర్ లకు మండల కేంద్రంలోని గ్రామ గ్రామాన ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించిన సందర్భంగా రాష్ట్ర ఆది నాయకత్వానికి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. అనంతరం జై కేసీఆర్ అంటూ పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, సుద్దాం నవీన్, డాక్టర్ ఎంఏ అకీమ్, డ్రైవర్ సాయిలు, సాగర్, వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొగలపల్లిలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు వెంకటరావుకు ఘన సన్మానం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల, ఏప్రిల్ 27(జనసంఘర్షణ ):



తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్ ) రాష్ట్ర మూడవ మహాసభలను విజయ వంతంగా ముగించుకుని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బోడంకి చందు కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘుపతి మధుసూదన్ ఏప్రిల్ 25 రాత్రి 8 గంటలకు చర్ల మండలం మొగలపల్లి గ్రామానికి చేరుకుని, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు చింతూరి వెంకటరావుని తన కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. చింతూరు వెంకట్రావు 94 ఏళ్ల జీవిత ప్రయాణంలో సమాజహితం కోసం నిరంతరం పోరాడుతూ, పీడిత ప్రజల హక్కుల సాధనలో అగ్రగామిగా నిలిచినారు, వెంకటరావు గారు గ్రామీణ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని నాయకులు కొనియాడారు. ఆయన సేవలు కార్మిక, కర్షక లోకానికి మార్గదర్శకంగా నిలిచాయని, మార్క్సిస్టు సిద్ధాంతాలను ఆచరణలో చూపిన మహనీయుడని ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు బొండంకి చందు, నాయకుడు రఘుపతి మధుసూదన్ తదితరులు శాలువాలతో సన్మానం చేసి, గురువర్యులకు అక్షర కుసుమాలు అర్పించారు. వారి సందేశంలో "చింతూరి వెంకటరావు గారి జీవితం ఒక పోరాట గాథ, ఒక చైతన్య జ్యోతి అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఏకైక కుమారులు చింతూరి రజనీకాంత్, కూతుర్లు హేమలత, నాగమణి, మనుమరాలు అరుణకుమారి, జరీనా, మనుమండ్లు మిధున్ చక్రవర్తి, మల్లికార్జున రావు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వం

శ్రీకాకుళం జిల్లా, ఎచ్చర్ల మండలం, డి మత్స్యలేషం, ఏప్రిల్ 27(జనసంఘర్షణ )

ప్రైవేటు సంస్థకు జువ్వలదిన్నె కట్టబెట్టే యత్నం, కూటమి ప్రభుత్వం నుండి వాడబలిజ మత్స్య కార కార్పొరేషన్ ఇవ్వాలి. బుడగట్ల పాలెం హార్బర్ ను పనులు నిలుపు వేయుడం కూటమి ప్రభుత్వం కి సిగ్గు చేటు అని, జువ్వలదిన్నె హార్బర్ ప్రైవేట్ కరణ కి అప్పగిస్తే మత్స్యకారుల తిరుగుబాటు తప్పదు. మత్స్యకారుల సంక్షేమం కోసం వైయస్ . జగన్ నిర్మించిన ఫిషింగ్ హార్బర్లను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని మత్స్య కారులు ధ్వజం ఎత్తారు, ఒకవైపు వైయస్. జగన్ మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేలా 10 హార్బర్లు, 4 పోర్టులు శంకుస్థాపన చేసి నిర్మాణనికి శ్రీ కారం చుట్టారని మత్స్య కారులు పేర్కొన్నారు. మత్స్యకారుల కోసం మీరేం చేశారు. ఈ నేపథ్యంలో మత్స్యకారుల హక్కులను కాలరాసే ఏ నిర్ణయాన్నైనా శ్రీ కాకుళం మత్స్య కారులు కూటమి ప్రభుత్వం కి వ్యతిరేకిస్తామని, వైయస్.జగన్ మత్స్యకారుల కోసం నిర్మించిన ఈ ఆధునిక దేవాలయాలను, హార్బర్లను, ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టాలని చూస్తే గంగపుత్రులు ఊరుకోమని హెచ్చరించారు. తక్షణమే జువ్వలదిన్నె హార్బర్‌లో ప్రైవేట్ సంస్థకు ఇచ్చిన కేటాయింపులను రద్దు చేయాలని, నిలిపివేసిన మిగిలిన హార్బర్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే మత్స్యకారులందరినీ ఏకమై ఈ అన్యాయంపై ప్రత్యేక్ష పోరాటానికి దిగుతాం అని మత్స్య కారులు మూగి, గురు మూర్తి న్యాయవాది,కోడ సూర్య నారాయణ, మూగి అప్పన్న, బడి ఎర్రయ్య, వాసుపల్లి నర్సింహా మూర్తి, సురేష్ తండేల్ లు డిమాండ్ చేశారు.

## శాసనమండలి సభ్యులుగా పదవి స్వీకారం ప్రమాణం చేసిన మమ్మద్న అజారుద్దీన్, కోదండరాం

హైదరాబాద్/ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)



మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ , ప్రొఫెసర్ కోదండరాం శాసనమండలి సభ్యులుగా పదవీ స్వీకార ప్రమాణం చేసిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరయ్యారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన అజారుద్దీన్, కోదండరాం తో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారి చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి , మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

# మహిళలు, పిల్లల రక్షణ కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- **మహిళలకు భద్రత కల్పన ఉద్దేశంతో రాష్ట్రంలో షీ టీమ్స్ ఏర్పాటు**
- **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి.**

హైదరాబాద్/ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)

మహిళలు, పిల్లల రక్షణ కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మహిళలకు భద్రత కల్పించాలన్న ఉద్దేశంతోనే రాష్ట్రంలో షీ టీమ్స్ ఏర్పాటు, స్టాండ్ విత్ హర్ లాంటి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేస్తూ, అదే కోవలో కొత్తగా స్పందన (తక్షణ రక్షణ) బృందాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి స్పందన (తక్షణ రక్షణ) వాహనాలకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నగర పోలీసులు, పీస్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో స్పందన టీమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "మహిళ తన కాళ్ల మీద తాను నిలబడాలంటే వారికి తగిన రక్షణ కల్పించాలి. వారి పిల్లలకు భద్రత ఉండాలి. మహిళ చదువు, వ్యాపారాన్ని స్వేచ్ఛగా నిర్వహించినప్పుడే సమాజం ప్రగతి సాధిస్తుంది" అని నొక్కిచెప్పారు. మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న సంఘటనలను పూర్తిగా నిరోధించి వారికి తగిన రక్షణ కల్పించే విషయంలో స్వచ్ఛంధ సంస్థలు, పీస్ కమిటీలు కూడా సామాజిక బాధ్యతగా పనిచేయాలని కోరారు. "మహిళల పట్ల దురుసుగా, అవహేళనగా ప్రవర్తించిన వారిని శిక్షించడానికి షీ టీమ్స్ ఏర్పాటు చేయగా, సమాజంలో వివక్షకు గురవుతున్న మహిళకు అండగా నిలవాలన్న లక్ష్యంతో స్టాండ్ విత్ అర్ అన్న కార్యక్రమం చేపట్టాం. ఈరోజు మరో అడుగు ముందుకేసి నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు పనిచేసే స్పందన టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లు బాధితుల వద్దకు వెళ్లి ముందు వారికొక మానసిక ధైర్యాన్ని కల్పిస్తాయి. ఆ తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటాయి. మహిళ తన గౌరవాన్ని కాపాడటంలో ఈ ప్రభుత్వం, ఈ సమాజం పక్కన నిలబడుతుందన్న నమ్మకం, విశ్వాసం వారిలో కల్పించాలి. మహిళలకు సమస్యలు వచ్చినప్పుడు స్పందించడం కన్నా సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత పౌర సమాజంపైన కూడా ఉంది" అని గుర్తుచేశారు.

"పీస్ కమిటీల సామాజిక బాధ్యతలను విస్తరించాలి. అసాంఘిక చర్యలను నియంత్రించడంలో వారిని భాగస్వామ్యం చేయాలి. కమిటీ సభ్యులు వారి ప్రాంతాల్లో ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు చేరవేయాలి.

మహిళలు, పిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలను పరిశీలిస్తే అందుకు పాల్పడుతున్న వారు వ్యసనాలకు బానిసలై మత్తు పదార్థాలను సేవించి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో కూడా ఈగల్ ఫోర్స్ ద్వారా కఠిన వైఖరిని అవలంభిస్తోంది.




ఇందులో విషయంలో ఎవరికీ మినహాయింపులు లేవు. ఈ సమాజం ప్రమాదబారిన పడకుండా మీ ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర డ్రగ్స్ వినియోగించినా, ప్రోత్సహించినా వెంటనే పోలీసుల దృష్టికి తేవాలి" అని ముఖ్యమంత్రి కోరారు. "తెలిసీ తెలియక డ్రగ్స్ బాట పట్టిన వారి కోసం రాష్ట్రంలో పెద్దఎత్తున రీహాబిలిటేషన్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. డ్రగ్స్ నియంత్రణలో స్వచ్ఛంధ సంస్థలు కూడా భాగస్వామ్యం కావాలి. సమాజంలో మత్తును వదిలించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వాటిల్లో ఎంత పెద్దవారైనా సరే, అలాంటి వారిని ప్రజల్లో నిలబెట్టగలిగితే అందరికీ ఒక సందేశమిచ్చినట్టవుతుంది. సమాజంలో బాధ్యత, భయం వస్తుంది" అని చెప్పారు. "మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పించినప్పుడే రాష్ట్రం, దేశం ప్రగతిపథంలో నడుస్తుంది. 2034 నాటికి రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది" అని వాటి వివరాలందించారు. మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరుతో మంజూరు చేయడం, 67 లక్షల మంది సభ్యులున్న స్వయం సహాయక సంఘాలకు 60 వేల కోట్ల బ్యాంకు లోన్ లింకేజీ కల్పించడం, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, వెయ్యి బస్సులకు యజమానులుగా చేయడం, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు నిర్వహించేలా ప్రోత్సహించిన విషయాలను ప్రస్తావించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో 26 వేల ప్రభుత్వ పాఠశాలలను మహిళా సంఘాలకు అప్పగించడం, ఈ స్కూళ్లలో విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం, మహిళా సంఘాల వస్తువుల మార్కెట్ కోసం హైటెక్ సిటీ పక్కన 3.5 ఎకరాల విలువైన స్థలం ఇందిరా మహిళా శక్తి స్టాల్స్ కోసం అప్పగించడం వంటి అనేక అంశాలను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఐసీసీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, హైదరాబాద్ పీస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గో రక్షకు స్థలం కేటాయించాలని ఎమ్మార్వోకు విన్నతిపత్రం

- **నిజామాబాద్ జిల్లా పతంగల్ మండల కేంద్రంలో గోరక్ష నినాదంతో ఊరేగింపుగా వచ్చి వినతి పత్రం సమర్పించిన గోరక్ష సమితి సభ్యులు**

పోతంగల్ మండల /ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)




బృందావనం గో రక్షా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాశెట్టి ఆదిత్య గుప్త మాట్లాడుతూ, గో మాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని భారత దేశమంతటా జరుగుతున్న ఉద్యమం లో భాగంగా ఈ రోజు పీ త్తంగల్ మండలంలో మండల ప్రజలు తో కలసి భారీ ర్యాలీ గా వెళ్లి ఎం.ఆర్.ఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. గో మాత ను జాతీయ జంతువు గా ప్రకటించడం ఎంతైతే ముఖ్యమో పోతంగల్లో బృందావనం గోశాల ను నిర్మించాలన్నది కూడా అంతే ముఖ్యమని తెలిపారు. కులాలకి, మతాలకి, ప్రాంతాలకి, పార్టీలకి, అతీతంగా గోవు అనేది విశ్వ జనని అని వారు తెలిపారు. ఈ మహా కార్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఇతర మతాలకు మనం గౌరవిస్తూనే మన సనాతన ధర్మాన్ని కాపాడుకునే పూర్తి బాధ్యత మనందరిదని వారు తెలిపారు. ఇతర మతాలకి కేటాయించినట్లుగానే సనాతన హిందూ ధర్మం కొరకు పోతంగలో బృందావనం నిర్మాణం కొరకు 20 ఎకరాల ప్రభువత్వ భూమిని కేటాయించవల్సిందిగా పోతంగల్, మండల ప్రజల ఎం.ఆర్.ఓ. కి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ బృందావనంలో మొదటి మెట్టుగా గోశాలను నిర్మించుకుని భవిష్యత్తు లో వేద పాఠశాల, హనుమాన్ వ్యయం శాల, ధ్యాన మందిరం, మరియు గీతా భవన్ ను ఏర్పాటు చేసుకునే దిశగా ప్రణాళిక ఉన్నందున వీటిని దృష్టి లో పెట్టుకుని 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించవల్సిందిగా ఎం.ర్.ఓ. పోత్తంగల్ మండల్ ప్రజలు వినతి పత్రం ఇచ్చినారు. ఈ కార్యక్రమం 1, ఎన్నారై శశాంక్, ప్రకాష్ పటేల్, బజరంగ్, శేఖర్ సెట్, పబ్బాశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాట్లపై పరిశీలన




కుప్పం,ఏప్రిల్ 27 (జన సంఘర్షణ):

విశాఖపట్నంలోని తార్లువాడ ఐటీ హబ్ అండ్ గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన ఏర్పాట్లను ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పరిశీలించారు. జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులతో కలిసి ఆయన సభా ప్రాంగణాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ..గూగుల్ డేటా సెంటర్ స్థాపన నవ్యాంధ్ర ప్రగతికి నూతన దిశ అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, మంత్రి నారా లోకేష్ పట్టుదల వల్లే ఇది సాధ్యమైందని కొనియాడారు. ఈ భారీ ప్రాజెక్టుతో విశాఖ అంతర్జాతీయ టెక్ డెస్టినేషన్గా ఎదుగుతుందని, యువతకు ఐటీ రంగంలో అపార ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఎస్సై బదిలీ... మండల కేంద్రంలో గ్రామస్తులు టపాసులు కాలుస్తూ సంబరాలు

- **అవినీతి అధికారి పీడపోయిందని**

హైదరాబాద్/ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)





ప్రభుత్వ ఉద్యోగులు అంటే ప్రజా సేవకులు. ప్రభుత్వ ఏ కార్యాలయంలో పనిచేసినప్పటికీ ప్రజల కోసం కార్యాలయానికి వస్తే వారికి వారి సమస్యలు వెంటనే తీర్చి పంపిస్తే అధికారుల్ని గుండెల్లో పెట్టుకొని ప్రజెంట్ చూసుకుంటారు. కానీ అదే అధికారులు లంచాలకు ఎగబడితే ప్రజలు తిరుగుబాటు చేస్తారు. ఇటీవల హైదరాబాద్లో డిజిపి బదిలీ అయితే ఆయనను అందంగా అలంకరించిన వాహనంలో కూర్చుని పెట్టి పోలీసు ఉన్నతాధికారులు, మహిళా అధికారులు తాడు ఆ వానానికి కట్టి లాగి తమ భక్తిని చాటుకున్నారు. కానీ మహబూబాబాద్ జిల్లా చిన్న కొండూరు మండల కేంద్రంలో ఎస్సైగా పనిచేస్తున్న ప్రవీణ్ రెడ్డి అవినీతికి అక్రమాలకు పాల్పడుతూ, ఇష్టం వచ్చిన వారిపై కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు . ఈ అవినీతి ఎస్సై పీడ ఎప్పుడు వదులుతుందని ఎదురుచూస్తున్న సమయం రాని వచ్చింది. ఆ ఎస్ఐ బదిలీ కావడంతో మండల ప్రజలు టపాసులు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఇంత నీచనికి ఓ చట్టాన్ని కాపాడాల్సిన ఓ అధికారి ఇలా లంచాలకు ఎగబడి ప్రజల్లో విశ్వాసం కోల్పోవడం పట్ల ఆ పోలీస్ శాఖకు మచ్చ తెచ్చాడు.హబూబాబాద్ జిల్లా చిన్న గూడూరుమండల కేంద్రంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్రెడ్డి బదిలీతో గ్రామంలో సంబరాలు నెలకొన్నాయి. ఎస్ఐ బదిలీ పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ బాణాసంచా పేల్చుతూ పండగ వాతావరణంలో ఆనందం వ్యక్తం చేశారు గ్రామస్తులు. ఎస్ఐ గత కొంతకాలంగాకక్షపూరితంగా వ్యవహరిస్తూ..ప్రశ్నించినవారిపై దాడులు చేసేవాడని అంటున్నారుగ్రామస్తులు. అక్రమ కేసులు నమోదు చేసితమను ఇబ్బంది పెట్టిన ఎస్ఐ బదిలీకావడంతో తమకు రిలీఫ్ కలిగిందనిఅంటున్నారు గ్రామస్తులు. సైకో ఎస్ఐనుండి తమ గ్రామానికి విముక్తికలిగిందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తులు.అంతే కాకుండా.. పరిధి దాటి ఇతర గ్రామాల వ్యవహారాల్లో కూడా జోక్యం చేసుకునేవాడని.. ఇతర అధికారుల పనుల్లో జోక్యం చేసుకొని జనాన్ని తీవ్ర ఇబ్బందికి గురిచేసే వాడని అంటున్నారు గ్రామస్తులు. అన్ని గ్రామాల్లో రాజకీయాలు చేస్తూ ఇతర అధికారుల డ్యూటీలు కూడా తానే చేస్తున్నట్లు వ్యవహరించేవాడని ఆరోపిస్తున్నారు గ్రామస్తులు.ఎస్ఐ తీరుతో సామాన్య జనం చాలా ఇబ్బందికి గురయ్యారని... ఇప్పుడు ఆయన బదిలీ కావడంతో ఉపశమనం లభించిందని అంటున్నారు. ఎస్ఐ బదిలీకి సంబంధించి చర్యలు తీసుకున్న తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు గ్రామస్తులు.

## విలేకరి మోహన్‌పై దాడి హేయమైన చర్య పలమనేరు జర్నలిస్టుల ఆగ్రహం



పలమనేరు, ఏప్రిల్ 27 (జన సంఘర్షణ) :

సమాజంలో జరుగుతున్న అన్యాయాలను నిలదీసే జర్నలిస్టుల పై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని పలమనేరు జర్నలిస్టులు మండిపడ్డారు. ఆంధ్రప్రభ విలేకరి మోహన్‌పై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తూ, స్థానిక సీఐ మోహన్ రెడ్డికి సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విలేకరిపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి, కేసులు నమోదు చేయాలన్నారు. నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉండే విలేకరుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. జర్నలిస్టులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వార్తలు రాస్తున్నారన్న నెపంతో భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేయాలని చూడటం సరికాదని విలేకరులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శరత్, రమేష్, రెడ్డి ప్రసాద్, మహబూబ్, దిలీప్, శ్రీనివాసులు, వినోద్, నౌషాద్, సురేష్, భాస్కర్, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

## గో రక్షకు స్థలం కేటాయించాలని ఎమ్మార్వోకు వినతిపత్రం

కోటగిరి/ ఏప్రిల్ 27/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో గోరక్ష నినాదంతో ఊరేగింపుగా వచ్చి వినతి పత్రం సమర్పించిన గోరక్ష సమితి సభ్యులు. బృందావనం గో రక్షా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాశెట్టి ఆదిత్య గుప్త మాట్లాడుతూ.. గో మాత ను జాతీయ జంతువుగా ప్రకటించాలని భారతదేశమంతటా జరుగుతున్న ఉద్యమం లో భాగంగా ఈ రోజు కోటగిరి మండల ప్రజలు తో కలసి భారీ ర్యాలీ గా వెళ్లి ఎం.ఆర్.ఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. గో మాత ను జాతీయ జంతువు గా ప్రకటించడం ఎంతైతే ముఖ్యమో కోటగిరి లో బృందావనం గోశాల ను నిర్మించాలన్నది కూడా అంతే ముఖ్యమని తెలిపారు. కులాలకి,మతాలకి, ప్రాంతాలకి, పార్టీలకి, అతీతంగా గోవు అనేది విశ్వ జనని అని వారు తెలిపారు. ఈ మహా కార్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఇతర మతాలకు మనం గౌరవిస్తూనే మన సనాతన ధర్మాన్ని కాపాడుకునే పూర్తి బాధ్యత మనందరిదని వారు తెలిపారు. ఇతర మతాలకి కేటాయించినట్లుగానే సనాతన హిందూ ధర్మం కొరకు కోటగిరి లో బృందావనం నిర్మాణం కొరకు 20 ఎకరాల ప్రభువత్వ భూమిని కేటాయించవల్సిందిగా కోటగిరి మండల ప్రజల ఎం.ఆర్.ఓ. కి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ బృందావనం లో మొదటి మెట్టు గా గోశాల ను నిర్మించుకుని భవిష్యత్తు లో వేద పాఠశాల, హనుమాన్ వ్యయం శాల, ధ్యాన మందిరం, మరియు గీతా భవన్ ను ఏర్పాటు చేసుకునే దిశగా ప్రణాళిక ఉన్నందున వీటిని దృష్టి లో పెట్టుకుని 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించవల్సింది గా ఎం.ర్.ఓ. కు కోటగిరి మండల ప్రజలు వినతి పత్రం ఇచ్చినారు. ఈ కార్యక్రమం లో బృందావనం వ్యవస్థాపక అధ్యక్షులు మాశెట్టి ఆదిత్య గుప్త , ప్రధాన కార్యదర్శి శివశ్రీనివాస పసి , సహాయ కార్యదర్శి లింగారం , అదనపు సహాయ కార్యదర్శి తోట శ్రీకాంత్, కోశాధికారి శివయ్య చారి, సహాయ కోశాధికారి వెంకటేశం , చీ=× కోనేరు శశాంక్, శివచరణ్ పటేల్ ,గరిదాస్ గంగాధర్,బార్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు..

జన సంఘర్షణ
మంగళవారం
28 ఏప్రిల్ 2026

## తెలంగాణలో ఇంధన కొరత లేదు

**కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు**

**పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**

**హైదరాబాద్, :** తెలంగాణలో ఇంధన కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో తగినన్ని ఇంధన నిల్వలున్నాయని వెల్లడించింది. వదంతులను పట్టించుకోవద్దని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టి.. ఇంధనం నిల్వ చేయడం నేరమని హెచ్చరించారు.

## పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ:



**చిట్యాల, ఏప్రిల్ 27 :**
చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామం లో సోమవారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గ్రామ యువజన నాయకుడు జన్నపాల రాము ముం దుండి, ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో మధ్యాహ్న భోజన విరామ సమ యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవికాలం ఎండల తీవ్రత కారణంగా కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ, తమ దాహాన్ని తీర్చడమే కాకుండా ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లపు బుద్ధుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ ఝాన్సీ, జన్నపాల రేణుక, రాచమళ్ళ సంధ్య, గురిజ మమత, రూపని వనజ, ఉయ్యాల లక్ష్మ య్య తదితరులు మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు:




**చిట్యాల ఏప్రిల్ 27 :**
చిట్యాల మున్సిపల్ పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన తో పాటు పదేళ్లపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపించిన ఘనత కేసిఆర్ కె చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఒకటో వార్డు కౌన్సిలర్ మాజీ జడ్పిటిసి చేపూరి రవీందర్, సింగల్ విండో వైస్ చైర్మన్ మెండే సైదులు, మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, మాజీ కౌన్సిలర్ జమాన్ల శ్రీనివాస్ రెడ్డి, బొబ్బల శివ శంకర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ స్థానిక కౌన్సిలర్లు నిమ్మనుగోటి శ్రీనివాస్, SK షబానా అజీముద్దీన్, ఆగు అశోక్ యాదవ్ గుత్త సతీష్ రెడ్డి, సాయి రెడ్డి ప్రతాప్ రెడ్డి , బులుగూరి సైదులు, నాలావతి కృష్ణ, మారగోని రమేష్, ఖమ్మంపాటీ నరసింహ, రావుల వెంకన్న, కునూరి శంకర్, మాసపెల్లి వెంకన్న, సిలివేరు యశ్వంత్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..!

**-సీఎం రేవంత్ రెడ్డి అన్న సైన్యంగా పని చేసే కాంగ్రెస్ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదు**

**-కాప్రాలో బాబురావును పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్**
కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మం దుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.సీఎం రేవం త్ రెడ్డి అన్న సైన్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు.కాప్రా సర్కిల్ కు చెందిన సీనియర్ బాబురావును ఆయన నివాసం కంది గూడలో పరమేశ్వర్ రెడ్డి పరామర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఉప్పల్ నియో జకవర్గానికి కావాల్సిన నిధులను తెస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు.ఉప్పల్ నియోజ కవర్గానికి నిధులు తెచ్చినా, అభివృద్ధి పనులను చేపట్టినా ఆ ఘనత సీఎం రేవంత్ రెడ్డి గారికే దక్కుతుం దన్నారు.కొందరు అభివృద్ధి పనుల విషయంలో వారి ఉనికి కోసం చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ,కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో మాజీ కార్పొ రేటర్ సింగి రెడ్డి ధన్పాల్ రెడ్డి,స్వర్ణరాజ్ శివమణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజి రెడ్డి,రాజేం దర్,డివిజన్ అధ్యక్షులు నాగ శేషు,జిల్లా కార్యదర్శి దండల్ల మురళి,పవన్, అజీజ్,తన్నీరు శ్రీహరి,మల్ల రెడ్డి,నాగరాజు, తోటకూర శ్రీకాంత్,శ్రీకాంత్ గౌడ్, సత్యనారా యణ,పూర్ణ యాదవ్,రాజు,లింగం,టిల్లు యాదవ్, రాజన్,గుణశేఖర్,రోకేష్ యాదవ్, శివ, రమాకాంత్ రెడ్డి, ముర్తుజా,షేక్ చోటు బై,షాబు ద్దీన్, ఆరిఫ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం

**:- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర కమిషనర్ జె.అరుణ శ్రీ**





**రామగుండం,ఏప్రిల్ 27 :**
జనాభా లెక్కల స్వీయ గణన, స్వచ్ఛ సర్వేక్షణ్ పౌర స్పందన నమోదు చేయడం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కూడా మెప్మా ఆర్ పి లు సకాలం లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ),రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిం చారు.ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ మెప్మా ఆర్ పి లు ఇంటింటికి తిరుగుతూ ఏక కాలంలో ఈ మూడు ప్రక్రియలను పూర్తి చేయడానికి అవకా శం ఉందని అన్నారు.సిబ్బంది అందరూ తప్పనిసరిగా స్వీయ గణన విధానం ద్వారా జనాభా లెక్కల్లో తమ వివరాలు నమో దు చేసుకోవడంతో పాటు ఇతరుల ను ప్రోత్సహించాలని అన్నారు.రామగుండం నగరం రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఉత్తమ స్థానంలో నిలిచేందుకు ఎక్కువ సంఖ్యలో పౌరులు తమ ప్రతిస్పందన ఆన్ లైన్ లో నమోదు చేసేలా అవగా హన కల్పించాలని అన్నారు.అలాగే ఓటరు జాబితాలో ఉన్న పేర్లలో ఎవరైనా మరణించినా, శాశ్వతంగా మారినా గుర్తించి వారి పేర్లను తొలగిం చడం,అర్హులైన పౌరులు జాబితాలో ఉండేలా చూసు కోవడం లక్ష్యంగా కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయాలని బూత్ లెవెల్ అధికారులుగా పని చేస్తున్న మెప్మా ఆర్ పి లను ఆదేశించారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి,మెప్మా టి ఎం సి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్లో ఘనంగా బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఈ సందర్భంగా 190వ డివిజన్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం**

**ఏప్రిల్ 27,2026,అల్వాల్, సికింద్రాబాద్ :**
అల్వాల్ మల్కాజ్గిరి జిల్లా, ఏప్రిల్ 27 బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్వాల్ పరిధిలోని 190వ డివిజన్ తుర్కపల్లి బొల్లారం లోని బటన్గూడా, ప్రాం తాల్లో పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టి వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులు, కార్మికులు, ప్రయాణికులకు చల్లని మజ్జిగ అందజేసి నాయకులు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిం చింది.కార్యక్రమంలో జేఏసీ నాయకుడు పుట్నాల కృష్ణ మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కేవలం వేడు కలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వ హించడం సంతోషకరమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం పార్టీ లక్ష్యమని తెలిపారు.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, వేసవి కాలంలో వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేయడం ద్వారా కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ప్రజా సేవే ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.సీనియర్ నాయకులు మహే ష్ చెలిమెల మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రజల సేవలో ప్రతిఫలించాలన్నారు. పార్టీ కార్యకర్తలు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రజల ఆదరణ పొందడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపా రు.ఈ సందర్భంగా వాహనదారులు బిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఎండలో ప్రయాణిస్తున్న సమయంలో మజ్జిగ అందించడం ఉపశమనం కలిగించిందని అన్నారు.ఈ



కార్యక్రమంలో జేఏసీ నాయకుడు పుట్నాల కృష్ణ, భాస్కర్ రెడ్డి, మహేష్ చెలిమెల, రాము, శ్యామ్తో పాటు డివిజన్ నాయకు లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్య క్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# లేబర్ ఆఫీసర్కు సన్మానం

**:- డి బి ఎల్ డబ్ల్యూ ఏ అధ్యక్షులు బొంకూరి కైలాసం**



**పెద్దపల్లి,ఏప్రిల్ 27 :**
పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లేబర్ ఆఫీసర్ నజీర్ను దళిత బహుజన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొం కూరి కైలాసం బోకేతో సత్కరించి శాలు వాతో ఘనంగా సన్మానించారు. అనం తరం కార్యాలయ సిబ్బంది అభినం దనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ మానవత వెలుగు అవార్డు గ్రహీత దార మధు,జిల్లా మున్నూరు కాపు సంఘం సహాయ కార్యదర్శి ఐద తిరుపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co